Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు    స్థాపితం: 1930    జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

*Longest Living Newspaper in Telugu Journalism*

# జమీన్‌రైతు

సంపుటి: 81 • సంచిక: 10 • 5-3-2010 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

హెల్త్‌కేర్ క్లినిక్

నెల్లూరు.

ప్రత్యేకతలు

- దీర్ఘకాలిక చర్మవ్యాధులు
- కిడ్నీ మరియు పిత్తాశయములోని రాళ్లు
- కామెర్లు

యునాని చికిత్స ద్వారా నయము చేయబడును

డాక్టర్ పర్వీన్ B.U.M.S

యునాని వైద్యనిపుణులు

లేజర్ చికిత్స

Professor, Endodontics

కేర్ సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల

నెల్లూరు. ఫోన్: 2303300

# బొత్సా బాంబు బాగా పేలింది!

బొత్సా సత్యనారాయణ బాంబు పేల్చాడు. రాష్ట్ర విభజన జరిగితే తప్పేంటని ధైర్యంగా ప్రశ్నించాడు. సమైక్యాంధ్ర నినాదం విన్పిస్తున్న వారు తెలంగాణతో మనం ఎందుకు కలిసి వుండాలనుకొంటున్నామో చెప్పలేకపోతున్నారని వ్యాఖ్యానించాడు. హైదరాబాద్ తెలంగాణలో అంతర్భాగమని స్పష్టం చేశాడు. ఇవి మూడూ ఎంత వివాదాస్పద ప్రకటనలో చెప్పనవసరం లేదు. రెండు ప్రాంతాల రాజకీయవాదుల మధ్య పార్టీలకతీతంగా విద్వేషాలు, వైమనస్యాలు చెలరేగుతున్న ఉద్రిక్త సమయమిది. జై ఆంధ్ర నినాదం చేసేవారి మీద విద్యార్థిసంఘాలు దాడులు చేస్తున్నాయి. ఆ సభలు జరగకుండా అడ్డుకొంటున్నారు. లగడపాటి రాజగోపాల్, జెసి దివాకర్‌రెడ్డి, దేవినేని ఉమ, రాయపాటి సాంబశివరావు వంటి సంపన్నులు, హైదరాబాద్‌లో కోట్లాది రూపాయల ఆస్తి పాస్తులున్న రాజకీయవాదులంతా సమైక్య ఉద్యమం నడుపుతున్నారు. వారి ఉధృతికి, ఆంధ్రకు ప్రత్యేక రాష్ట్రం వుంటే బాగుండునన్న కోరిక కల్గినవారు కూడా నోరెత్తి మాట్లాడలేని పరిస్థితి నెలకొని వుంది. ఈ నేపథ్యంలో బొత్సా ప్రకటనలు సహజంగానే సంచలనం రేకెత్తిస్తున్నాయి.

బొత్సా సత్తిబాబు సాధారణ రాజకీయవాది కాదు. తన స్వయంశక్తితో పైకెదిగి, ఉత్తరాంధ్ర జిల్లాలు మూడింటినీ తన గుప్పెట్లో పెట్టుకొన్న మేధావి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్ వ్యతిరేక ప్రాంతాలుగా ముద్రపడిన నియోజకవర్గాలలో కూడా కాంగ్రెస్‌ను గెలిపించిన ఘనుడు. ఆయన ఇంట్లోనే నలుగురు చట్టసభల ప్రతినిధులున్నారు. మరొక ఇద్దరు ఎమ్మెల్యేలు ఆయన స్వంత అనుచరులు. రాష్ట్ర కాంగ్రెస్‌లో ఈ రోజు వైఎస్ జగన్ తర్వాత స్వంత వర్గం, బలగం వున్న నేత బొత్సా ఒక్కడే కావడం గమనార్హం.

ఇంత రాజకీయ అనుభవం, అవగాహన వున్న వ్యక్తి అంత తేలికగా జై ఆంధ్రా నినాదాన్ని పలవరించడు. దాని వెనుక ఏదో బలీయమైన కారణం వుండాలి. సమైక్యాంధ్ర రాష్ట్రంలో కాపులు ఎప్పటికీ ముఖ్యమంత్రి పదవి దక్కించుకోలేరని చిరంజీవి వైఫల్యంతో అర్థమైపోయింది. రాష్ట్రం విడిపోతే విజయనగరం, శ్రీకాకుళం, కృష్ణ, విశాఖపట్నం, కడప, చిత్తూరు వంటి జిల్లాలలో అధికంగా వున్న కాపు కుల జనాభా ఆధారంగా ఏదో ఒక నాటికి ఒక కాపు నాయకుడు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం దక్కుతుందన్న ఆశతోనే బొత్సా సత్తిబాబు సమైక్యాంధ్ర ఉద్యమాన్ని వ్యతిరేకిస్తున్నారని ఒక వాదన. ఢిల్లీ స్థాయిలో మంత్రాంగం నడుపుతున్న మాజీ పిసిసి అధ్యక్షుడు కె.కేశవరావు ప్రోత్సాహం

కొరవ 14వ పేజీలో

తృతీయ వర్ధంతి



స్నేహశీలి, సౌమ్యశీలి, సహనశీలి
అజాత శత్రువుగా, ఆదర్శప్రాయునిగా, కార్యదక్షునిగా
ఎందరినో ప్రభావితం చేసిన మార్గదర్శి, కృషీవలుడు
మా ఉన్నతికి బంగారు బాట వేసిన ఇలవేల్పు
శ్రీ చిట్టమూరు విజయకుమార్‌రెడ్డి గారి
ఆత్మ శాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

కీ॥శే॥ చిట్టమూరు విజయకుమార్‌రెడ్డి గారు
చీఫ్ ఇంజనీరు, తెలుగుగంగ ప్రాజెక్ట్, శ్రీకాళహస్తి
జననం : 06-12-1951 మరణం: 11.03.2007

చిట్టమూరు వాసుదేవరెడ్డి
చిట్టమూరు మహతి
చిట్టమూరు మహర్షిరెడ్డి
రాజవోలు గ్రామం, ఎ.ఎస్.పేట మండలం, నెల్లూరు.

# నక్సల్స్ నవ్వులాట

పిల్లి గుడ్డిదైతే ఎలుక తోక ఎత్తి దాని ముందే గంతులేస్తుందని సామెత. కేంద్ర హోంమంత్రి చిదంబరం, పశ్చిమ బెంగాల్ నక్సల్ నాయకుడు కిషన్‌జీ అలియాస్ మల్లోజుల కోటేశ్వరరావుల సంవాదం ఆ నానుడిని జ్ఞప్తికి తెస్తున్నది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆపరేషన్ గ్రీన్ హంట్ పేరిట నక్సల్స్ నిర్మూలనకు నెత్తుటి ఏర్లు పారిస్తున్న సమయమిది. చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో ఇందుకోసం వేలాది పారా మిలటరీ బలగాలను మొహరించారు. ఆయా రాష్ట్రాలలోని ఆదివాసీ ప్రాంతాలలో గత ఆరేడు నెలలుగా యుద్ధ వాతావరణం నెలకొని వుంది. దాన్ని ప్రతిఘటించడంలో ప్రధానపాత్ర పోషిస్తున్నవాడు కిషన్‌జీ. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో టాటా కంపెనీ తలపెట్టిన నానో కార్ల తయారీ కర్మాగారం స్థాపనకు అడ్డం కొట్టిందీ ఆయనే. సిపిఎం నాయకత్వం, ప్రభుత్వం ఎంతగా గింజుకొన్నా ఆ ఉద్యమాన్ని ఆపలేకపోయారు. చివరకు టాటాలే వూరు విడిచి వెళ్లారు.

ఇప్పుడు కేంద్ర హోంమంత్రి జరిపిస్తున్న ఆపరేషన్ గ్రీన్ హంట్ కూడా కార్పొరేట్ కంపెనీల లాభాల కోసం చేపట్టినదే. చత్తీస్‌ఘడ్, ఒరిస్సా, జార్ఖండ్ రాష్ట్రాలలో బాక్సైట్, ఐరన్ ఓర్, మాంగనీసు వంటి ఖనిజ నిల్వలు అపారంగా వున్నాయి. స్టెరిలైట్, టాటా, మిట్టల్ ఆర్సెలర్, వేదాంత, హిందూస్థాన్ అల్యూమినియం, రసాల్‌ఖైమా వంటి బహుళ జాతి కార్పొరేట్ కంపెనీల ఆ ప్రకృతి సంపదతో లాభాల పంట పండించుకోవడానికి తహతహ లాడుతున్నాయి. కొన్ని వేల తరాలుగా అదే అడవులలో వున్న ఆదివాసీ ప్రజల జీవితాలు దాని వల్ల చిధ్రమై పోతున్నాయి. వారు తమ నివాసాలనే కాదు, జీవనాధారాన్ని కూడా కోల్పోతున్నారు. ప్రకృతి ఒడిలో పుట్టి పెరిగే బిడ్డలకు ప్రకృతి సంపదలో వాటా వుండాలన్నది సహజ న్యాయం. కానీ ఇక్కడ అది అమలు జరగడం లేదు. ఈ దురన్యాయాన్ని కిషన్‌జీ ప్రతిఘటిస్తున్నాడు. ఆదివాసీలు ఆయన్ను తమ పాలిట దేముడివలె భావిస్తున్నారు. తమ కడుపులో పెట్టుకొని దాచుకొంటున్నారు.

మరొకప్రక్క ఆపరేషన్ గ్రీన్ హంట్‌కు మేధావి వర్గాల నుంచి తీవ్ర నిరసన ఎదురౌతున్నది. అరుంధతీరాయ్ వంటి ప్రపంచ ప్రసిద్ధ రచయిత్రులు, పలువురు పాత్రికేయులు, పౌరహక్కుల నేతలు, కొందరు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులతో సహా మేధావి వర్గాలన్నీ ఆపరేషన్ గ్రీన్ హంట్‌లోని దురుద్దేశాల పట్ల ప్రజలను చైతన్యం చేస్తున్నారు. ఆ తాకిడి తట్టుకోవడం కేంద్ర ప్రభుత్వ తరం కావడం లేదు. మరొకప్రక్క ఆదివాసీల మద్దతు కారణంగా ఆపరేషన్ గ్రీన్ హంట్ విఫలమై పోతున్నది. మేధావి వర్గాలను శాంతింపచేయడానికి నక్సల్స్‌తో చర్చలకు సన్నద్ధమని ప్రకటించాడు చిదంబరం. సామాజిక దోపిడీకి విప్లవం ఒక్కటే పరిష్కారమనే సిద్ధాంతంతో ఉద్యమిస్తున్న నక్సలైట్లు చర్చలకు సిద్ధం కారని, ఒకవేళ అందుకు ముందుకు వచ్చినా వ్యూహాత్మకమే తప్ప ఫలితం వుండదని ఆయనకు తెలుసు. కానీ ప్రభుత్వం నిరంకుశంగా హింసకు ప్రతి హింస చేస్తున్నదన్న నిందను మరిపించడానికి ఈ ఎత్తుగడ వేశాడాయన.

ఇక్కడే మొదలైంది చిదంబరం, కిషన్‌జీల క్రీడా వినోదం. చర్చలకు సిద్ధమైతే తన శాఖకు తెలపమని హోంమంత్రి ఒక ఫోన్ నంబర్ పత్రికలలో ప్రకటిస్తే, నువ్వు మాట్లాడాలంటే నాకే ఫోన్ చేయమని కిషన్‌జీ కూడా ఒక నంబర్ ఇచ్చాడు. సెల్‌ఫోన్ నంబర్ల ద్వారా పెద్ద పెద్ద నేరస్తులను ఇట్టే పట్టేస్తున్నారు పోలీసులు. ఆ సాంకేతిక పరిజ్ఞానం వారి వద్ద వుంది. కానీ కిషన్‌జీ మాత్రం గత ఆరునెలలుగా బెంగాల్ రాష్ట్ర మంత్రులు, దేశంలోని వందలాది మంది పాత్రికేయులతో స్వేచ్ఛగా ఫోన్లలో మాట్లాడుతున్నాడు. కానీ ఆయన్ను పట్టుకోవడం ప్రభుత్వాల తరం కావడం లేదు. అంటే ప్రభుత్వం దగ్గరకంటే, నక్సల్ నేతల వద్ద మరింత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో వుందన్న మాట. ఒకప్రక్క ఆదివాసీలు, మేధావి వర్గాల మద్దతు; మరొకప్రక్క ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం చేతపట్టుకొని కేంద్ర ప్రభుత్వంతో నవ్వులాటకు దిగుతున్నాడు కిషన్‌జీ. చిదంబరానికి ఇంతకంటే అవమానం వేరొకటి లేదు.

## జనవాణి

### ఇబ్బందుల్లో జిల్లా రైతాంగం!

జిల్లా రైతాంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. ఆరుగాలం శ్రమపడి పండించిన ధాన్యానికి ఎఫ్‌సిఐ, ధాన్యం వ్యాపారుల నిర్లక్ష్యం వల్ల మద్దతు ధర లభించడం లేదు. నల్లమచ్చ సాకుతో ధాన్యాన్ని మద్దతు ధరకంటే తగ్గించి కొనడం ఘోరం. 2002-03 సంవత్సరంలోనూ మసూర్‌పై నల్లమచ్చ కనపడగానే ఎఫ్‌సిఐ డైరక్టర్ హోదాలో కేంద్ర ఆహార మంత్రిత్వశాఖ కార్యదర్శి అరుణ్ భట్నాగర్‌ను కలసి సమస్యను వివరించి ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసేట్లు చేశాను. జిల్లాలో వున్న రైతు సంఘాల నాయకులు నెల్లూరు జిల్లాకు చెందిన పార్లమెంటు సభ్యులచేత ఈ సమస్య పరిష్కారానికి ఢిల్లీ స్థాయిలో ప్రయత్నిస్తే బాగుంటుంది. సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, నెల్లూరు

### ఆదాయపు పన్ను వాపసు చేయాలి!

వుద్యోగాలు చేస్తున్న వారికి నెల జీతం చెల్లించేటప్పుడు ఆ సంవత్సరంలో ఆదాయం బేరీజు వేసి చెల్లించవలసిన ఆదాయపు పన్నును యజమాని నెలనెలా ఓగపట్టి ఆదాయపు పన్ను శాఖకు చెల్లించడం నిబంధన. ఈ మేరకు సంవత్సరం ఆఖరున సదరు వుద్యోగి సంబంధిత రిటన్ దాఖలు చేసి అదనంగా పన్ను చెల్లించి వుంటే ఆ మొత్తం తనకు వాపసు చేయమని కోరుతాడు. ఆదాయపు పన్నుశాఖ పరిశీలించి వాపసు చేయాలి. కాని రిటర్న్ దాఖలు చేసిన తర్వాత అదనంగా చెల్లించిన పన్ను వాపసు దైవాధీనంగా వుంది. విచారిస్తే జూన్ 2009 వరకు దాఖలు చేసిన రిటర్న్ పరిశీలన పూర్తయ్యింది. మిగతాది పరిశీలిస్తున్నాం అన్న జవాబు తప్ప మాకు వాపసు రావలసిన మొత్తానికి ఇంతవరకు అతీగతీ లేదు. ఇది అన్యాయం.

ములుమూడి ప్రభాకర్‌రావు, నెల్లూరు

### పనిలేని నాయకులకు ప్రాణం పోస్తున్న టీవీలు!

కాలక్షేపంలేని రాజకీయ నాయకులకు బుల్లితెర పెద్ద అండ అయ్యింది. చీమకుట్టినా, దోమకుట్టినా చర్చావేదికలు. వాటిలో నోరు అదుపులో పెట్టుకోకుండా మాట్లాడే నేతల వల్ల రాష్ట్రంలో అనవసర రాద్ధాంతాలు రేగుతున్నాయి. టీవీల్లో వార్తలు, ప్రత్యక్ష ప్రసారాలను అదుపు చేసే వ్యవస్థను కేంద్ర ప్రసార మంత్రిత్వశాఖ ఎందుకు ఏర్పాటుచేయలేదో అర్థం కావడం లేదు.

వాస్తు రామచంద్ర, నెల్లూరు

కొరవ 14వ పేజీలో

## 70 ఏళ్ల క్రితం ఈవారం

8-3-1940
పేజీలు : 16 వెల: అణా

### నెల్లూరు ముచ్చట్లు

#### హెల్తు

హెల్తు డిపార్టుమెంటు గారూ! అనవసరమైన పల్లెటూళ్ల తిరునాళ్లలో జిల్లా బోర్డు డబ్బును బెంగాలు రసగుల్లాలు మాదిరి సద్వినియోగం చేస్తుంటారే నెల్లూరు టవున్ సినిమా వద్ద కెళ్ళదాం పద అబ్బెబ్బే!! అవేమి మూత్ర ప్రవాహాలు, అవేమి గలీజులు, అవేమి చండాలాలు, అవేమి పెంటకుప్పలు.

అలా హోటళ్లలోకి పోదాము పద. నాకిన స్పూనులు, తాగిన కప్పు సాసర్లు, లోటాలు, ఇవెప్పుడైనా తెర్లబెట్టిన పాపాన పోతున్నారా? సాంక్రమిక వ్యాధులు వస్తవంటే ఇక రావూ?

అటు బస్సుల వద్దకు పోదాంపద. ఆ కూర్చునే సీట్సుకు తొడిగిన కవరు గుడ్డలు ఎన్ని దినాలకు చాకలి వారి గృహాలకు చేరుతున్నవో చూడండి. కొన్ని వ్యాధులు రావటానికి సహాసనం, సశయ్యా కారణాలన్నారు. ఎన్ని కొత్త హెల్తు చట్టాలొచ్చినా కొరడా జమాయించకపోతే ఏమీ లాభం లేదు.

16లక్షలు జనసంఖ్య గల జిల్లా అంతటికీ ఒక హెల్తు ఆఫీసరు, 46వేల జనసంఖ్య గల ఒక టౌన్‌కు మాత్రం ఒక హెల్తు ఆఫీసరు, ఏనుగులు మాదిరి దాణా మ్రింగుతున్నదే గాని ఈ డిపార్టుమెంటు ఏమన్నా కదలి పని జేస్తున్నదా?

#### సినిమా

మొత్తము ఇండియా అంతటా యే మూలబడితే ఆ మూల ప్రదర్శించి డబ్బు రాబట్టడానికి అవకాశం వున్న హిందీ చిత్రముల వాళ్ళే లక్షా, లక్షా 50వేల రూపాయల ఖర్చుతో చిత్రాలు తీయడానికి భయపడుతూ వుంటే, మన తెలుగు డైరక్టరు మహాశయులు లక్షా, లక్షా పదివేలు లేకపోతే చిత్రం తీయడానికి వీలు లేదని అంటూ సునాయాసంగా లక్షా 50వేలు ఖర్చు చేసి 'చచ్చిన శవాల' వంటి ఎందుకూ కొరగాని చిత్రాలు తయారుచేసి బయట పడవేస్తూ వున్నారు. చూచారా మనవారి ప్రతిభ.

–చిత్రగుప్తుడు

## 50 ఏళ్ల క్రితం ఈవారం

4-3-1960
పేజీలు: 12 వెల: 0-3-0

### హరి సర్వోత్తమరావు అస్తమయం!

ఆంధ్ర గ్రంథాలయోద్యమ పితామహుడు గాడిచర్ల హరి సర్వోత్తమరావు గారు గత 29తేది మద్రాసులో దివంగతులైనారు. చనిపోవునప్పటికి వారి వయస్సు 77 సంవత్సరాలు.

హరి సర్వోత్తమరావు గ్రంథాలయోద్యమ నాయకుడే గాదు, వయోజన విద్యా ప్రబోధకుడు, సంఘసేవకుడు, ఆంధ్ర రాష్ట్రోద్యమ ప్రముఖుడు, పత్రికా రచయిత, గ్రంథకర్త, 1905లోనే జైలు శిక్షననుభవించిన దేశభక్తుడు. ఆంధ్రదేశం ఒక ఉత్తమ నాయకుని కోల్పోయింది. వారి ఆత్మకు భగవంతుడు శాంతిని ప్రసాదించుగాక. వారి కుటుంబానికి మాసానుభూతి.

### కడుపునిండే లోకజ్ఞానం

ప్రభుత్వోద్యోగాలను కోరే తెలుగు యువకులు కొన్ని ప్రశ్నలకిచ్చిన సమాధానాలను చూస్తే వారి లోకజ్ఞానానికి కడుపు నిండిపోతుంది. సర్వీస్ కమీషన్ ఇటీవల వాటిని ప్రకటించింది. వెటరినరి హాస్పిటల్స్ (పశువైద్యశాలలు) అంటే ప్రసూతి చికిత్సాలయాలు అని ఒక ప్రబుద్ధుడు వ్రాశాడు.

మరొక తెలివి గల యువకుడు లైట్ హౌస్ అంటే అమెరికన్ అధ్యక్షుని అధికార నివాసమని వెలిబుచ్చాడు. లైట్ హౌస్ శబ్దానుకరణను బట్టి 'వైట్‌హౌస్' అనుకున్నాడు కాబోలు.

మరొక ప్రజ్ఞాశాలి దలైలామా అంటే శాంసన్‌ను ప్రేమించిన యువరాణి అని వ్రాస్తే; రెండవ స్పుత్నిక్‌లో పంపబడిన కుక్క అని మరొకరు; దాల్మియా సిమెంట్ కంపెనీ సంస్థాపకుడు అని వేరొకరు పేర్కొన్నారు.

ఈ విధంగా వున్నది మనవారి లోకజ్ఞానం. స్వరసామాన్య విషయాలు గూడ తెలియని ఇలాంటి వారు చదువుకొన్న వారుగావడం బాధాకరం.

# ● సంక్షేమ పథకాల్లో...

# సబ్సిడీలకు మంగళం!

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేరుకు వివిధ పథకాలకు కోట్ల రూపాయలు కేటాయిస్తున్నామని చెబుతున్నా అంతిమంగా విధిస్తున్న కోత వల్ల ఈ పథకాల అమలు ప్రశ్నార్థకమవుతోంది.**



నెల్లూరులోని ఇందిరక్రాంతి పథం కార్యాలయం.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సంక్షేమ అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నాయి. ప్రభుత్వానికి ఎన్ని ఇబ్బందులు ఎదురవుతున్నా సంక్షేమ పథకాల నిర్వహణకు నిధులు సమకూరుస్తుంది. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆర్థికంగా చేయూతనివ్వాలన్న లక్ష్యంతో పలు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టాయి. ఈ పథకాల కోసం కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తున్నప్పటికి ఆచరణలో మాత్రం చాలా కోతపడుతూ వస్తుంది. నిధుల్లో కోత విధిస్తుండడంతో పథకాల అమలులో వెనుకబడిపోవడంతో పాటు నిరుద్యోగులకు ఉపాధి లేకుండాపోతుంది.

## వేల సంఖ్యలో దరఖాస్తులు

జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్, బిసి కార్పొరేషన్, మైనార్టీ కార్పొరేషన్, ఐటిడిఏ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఇందిర క్రాంతి పథం తదితర శాఖల ద్వారా సంక్షేమ పథకాలు మంజూరవుతుంటాయి. ఎక్కువగా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయానికి రుణాల మంజూరు కోసం వేల సంఖ్యలో దరఖాస్తులు అందుతుంటాయి. గతంలో రుణం మంజూరుకు అందిన దరఖాస్తులను పరిశీలించి బ్యాంకు లింకేజి పథకాలను మంజూరు చేసేవారు. యూనిట్ విలువలో 20 శాతం మార్జిన్ మనీ, 10 శాతం సబ్సిడీని విడుదల చేయడం జరిగేది. గత సంవత్సరం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో సంక్షేమ శాఖలు మార్జిన్ మనీ విడుదల చేయకుండా కేవలం సబ్సిడీని మాత్రమే విడుదల చేస్తున్నాయి.

## బడ్జెట్‌లో కోత

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాలకు కూడా ఇక నుంచి సబ్సిడీ నిధుల విడుదలకు బ్రేకుపడే అవకాశం వుంది. కేంద్ర బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థికశాఖ మంత్రి ప్రణబ్‌ముఖర్జీ సంక్షేమ పథకాలకు సంబంధించి నిధుల కేటాయింపులో ఈ దఫా భారీ స్థాయిలో కోత పెట్టారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బిసీలకు ఇప్పటివరకు మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలకు సబ్సిడీ మాత్రమే సంబంధిత శాఖలు విడుదల చేస్తూ వస్తున్నాయి. 2010 – 2011 ఆర్థిక సంవత్సరంలో సబ్సిడీ నిధులకు కోత విధించనున్నారు. బ్యాంకు లింకేజి పథకాలలో బ్యాంకు అధికారులదే తుది నిర్ణయం కావడం వలన ఆశించినమేర రుణాల మంజూరుకు ముందుకు వచ్చేవారు కాదు. సంబంధిత అధికారులు కూడా వీటిపై పెద్దగా ఆసక్తి చూపడం లేదన్న ఆరోపణలు కూడా వున్నాయి.

## పట్టని ప్రజాప్రతినిధులు

మంత్రులు, ఉన్నతాధికారులు స్పందించి బ్యాంకులపై ఒత్తిడి తెస్తేనే కొంతమేరకైనా సంక్షేమ పథకాలకు రుణాలు అందుతున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి సబ్సిడీ నిధుల్లో కోత విధించడంతో యూనిట్ విలువలో 50శాతం వరకు లబ్ధిదారుడు భరించాల్సి వుంటుంది. మిగిలిన 50 శాతాన్ని బ్యాంకులు రుణంగా సమకూర్చే అవకాశం వుంటుంది. దీంతో సంక్షేమ పథకాలు మరి కొంత వెనక్కి వెళ్లిపోయే ప్రమాదం వుండడంతోపాటు, సామాన్య ప్రజలు బ్యాంకుల వైపు చూసే అవకాశం దొరకదు. ఇంతకు ముందు ఎస్సీకార్పొరేషన్ ద్వారా పారిశుద్ధ్య పనివారికి, పదవ తరగతి ఉత్తీర్ణులైన నిరుద్యోగులకు బ్యాంకులతో నిమిత్తం లేకుండా నేరుగా ఐదు లక్షల రూపాయల వరకు రుణాలు అందించేవారు. జాతీయ షెడ్యూల్డు కులాల ఆర్థికాభివృద్ధి సంస్థ (ఎస్ఎస్ఎఫ్‌డిసి) ఇందుకు నిధులు సమకూర్చేది. దీంతో జిల్లాలోని నిరుద్యోగులు అనేకమంది వివిధ యూనిట్లను స్థాపించేందుకు రుణాలు పొందారు. నేరుగా అందించిన రుణంలో ఎటువంటి సబ్సిడీ వుండేది కాదు.

## బ్యాంకు లింకేజిపై తగ్గిన ఆసక్తి!

ఈ రుణాలకు మంచి స్పందన రావడంతో బ్యాంకు లింకేజి పథకాలపై ఆసక్తి చూపేవారు తగ్గుముఖం పట్టారు. అయితే 2008 సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ రుణాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాఫీ చేయడంతో సంస్థ ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. మాఫీ చేసిన రుణాలను ప్రభుత్వం తిరిగి సంస్థకు జమ చేయకపోవడంతోపాటు నేరుగా అందించే పథకాలకు నిధులు కేటాయించకపోవడంతో ఈ పథకం తిరిగి పునః ప్రారంభించాలంటూ ఎస్సీ, ఎస్టీ, ఎమ్పీలు, ఎమ్మెల్యేల నుంచి వత్తిడి లేకపోవడంతో ప్రభుత్వం కూడా దీనిగూర్చి పట్టించుకోలేదు. ఎస్సీ, ఎస్టీ, బిసీలకు మంజూరు చేసే సంక్షేమ పథకాలలో సబ్సిడీ విడుదల చేయకపోతే వేలాది మంది లబ్ధిదారులు నష్టపోతారు.

## గత ఏడాది నిధులు ఇంకా ఖర్చుపెట్టలేదు!

2009-10 ఆర్థిక సంవత్సరానికి సంక్షేమశాఖలకు విడుదల చేసిన నిధులు కూడా ఆశించిన మేర ఖర్చు చేయబడలేదు. ఈ ఆర్థిక సంవత్సరం మరో నెల రోజుల్లో పూర్తవుతుంది. ఎస్సీ కార్పొరేషన్‌కు ఐదు కోట్లు కేటాయించగా వీటిలో ఫిబ్రవరి నెల వరకు 2 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేయగలిగారు. మరో కోటి రూపాయలు ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సి వుంది. ఇతర సంక్షేమశాఖలు కూడా విడుదల చేసిన నిధుల్లో 50 శాతం కూడా ఖర్చు చేయలేకపోయాయి. ఏదిఏమైనా సంక్షేమశాఖలకు కేటాయించే నిధుల్లో కోత విధించడం బాధాకరం.




శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానము

తూర్పుకనుపూరు గ్రామం, చిల్లకూరు మండలం, SPSR నెల్లూరు జిల్లా.

జాతర మహోత్సవ ఆహ్వానం

తేది 9-03-2010 నుండి 12-03-2010 వరకు

జాతర మహోత్సవ కార్యక్రమములు

9-03-2010 మంగళవారం — రాత్రి జాతర ప్రారంభం, శ్రీ పోలేరమ్మ వారి "నిలుపు"

10-03-2010 బుధవారం — పగలు - శ్రీ గురునాథస్వామి, అంకమ్మ దేవతలు "గ్రామోత్సవం, గొల్లల వేడుకలు"

11-03-2010 గురువారం — పగలు - శ్రీ గురునాథస్వామి గ్రామోత్సవము, రాత్రి - శ్రీ అమ్మవారి "ఉయ్యాలసేవ"

12-03-2010 శుక్రవారం — ఉదయం శ్రీ పోలేరమ్మకు వెళ్లనంపు ఉత్సవము జరుగును.

కళ్ళు మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణ

ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమములు కలవు

శ్రీ అమ్మవారికి మొక్కుబడులుగా వచ్చిన చీరలు తేది10-03-2010 నుండి 11-03-2010 వరకు ఉదయం 10 గంటలకు బహిరంగ వేలములో విక్రయించబడును. శ్రీ అమ్మవారికి కానుకగా వచ్చిన దున్నపోతులు 12-03-2010 ఉదయం 9-00 గంటలకు బహిరంగ వేలములో విక్రయించబడును.

ప్రతిరోజు జరిగే ఉత్సవములలో భక్తులందరూ పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదములు స్వీకరించి అమ్మవారి కృపాకటాక్షములు పొందగలరని కోరుచున్నాము.

చైర్మన్ | మరియు ధర్మకర్తల మండలి | కార్యనిర్వహణాధికారి



శ్రద్ధాంజలి

దివిలో మాకు దూరమై ఎన్నటికీ మరలిరాని లోకాలకు తరలి వెళ్లిన
మా ఇంటి వెలుగు, అమృతమూర్తి, అయ్యప్ప దీక్షాబద్ధులు
శ్రీ బి.శివరామ్ సింగ్ గారికి
రిటైర్డ్ హెడ్ డ్రాఫ్ట్స్‌మెన్, ఇరిగేషన్ డిపార్టుమెంటు.
అశ్రునీరాజనం. బాధాతప్త హృదయాలతో...

భార్య : బి. బాలత్రిపురసుందరి (కెనరాబ్యాంకు)
అన్న - వదిన : బి. బాలాజిసింగ్ - సరళాబాయి
సోదరి - బావ : సి. ఇందిరాబాయి - పృథ్వీరాజ్‌సింగ్
అన్నకుమారులు - కోడళ్ళు : బి. జితేంద్రబాబు - సునీత
బి. వినయబాబు - వినత
అన్న కుమార్తె - అల్లుడు : అనిత - బాలేంద్రసింగ్
మేనళ్ళుళ్లు : సి. వివేకానంద - రజని
సి.రాకేష్ - భార్గవి
మేనకోడలు : పి. లావణ్య - ప్రసాద్
కుటుంబ సభ్యులు



శ్రీ బి.శివరామ్‌సింగ్ గారు
జననం : 11-11-1941 మరణం : 22-02-2010



అల్లీపురంలోని పొక్కిరెడ్డి శేతువరామిరెడ్డి స్మారక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నిరంజన్‌కుమార్‌రెడ్డి, రాజేంద్రరెడ్డి తదితరులు.

# పంచాయితీల అభివృద్ధికి పెద్దపీట

**తిరుపతి ఎమ్పీ చింతా మోహన్ వెల్లడి**

పంచాయితీల అభివృద్ధికి పెద్ద పీట వేస్తామని తిరుపతి ఎమ్పీ చింతామోహన్ పేర్కొన్నారు. పొదలకూరులో పర్యటించిన ఆయన మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష చేశారు. ప్రతి గ్రామ పంచాయితీకి ఎమ్పీ ల్యాడ్స్ నుంచి లక్ష రూపాయలు నిధులు అందజేస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులకు వివిధ శాఖల అధికారులు నివేదికలు తయారు చేసి ఇవ్వాలని సూచించారు. కేరళలో పంచాయితీలకు పుష్కలంగా నిధులు మంజూరు అవుతున్నందున ఆ రాష్ట్రంలోని గ్రామాలు అన్నిరకాలుగా శోభిల్లుతున్నాయని తెలిపారు. రేషన్ కార్డుల తొలగింపులో అధికారులు కఠినంగా వ్యవహరించకుండా కొంత ఉదారత ప్రదర్శించాలన్నారు. తిరుపతి పార్లమెంటు నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చి దిద్దుతానని ప్రకటించారు. త్వరలో తడ వద్ద అంతర్జాతీయ ప్రమాణాలతో గుండె పరిశోధన, చికిత్సాలయాలను డాక్టర్ చెరియన్ సంస్థలు ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి 100 రోజులకు ఒక మండలంలో పర్యటిస్తానని, అభివృద్ధి పనులను పరిశీలిస్తానని చెప్పారు.

# నెల్లూరు మసూరికి నల్లమచ్చ

## ధాన్యం కొనని ఎఫ్‌సిఐ

అధిక విస్తీర్ణంలో సాగు చేసి పండించిన నెల్లూరు మసూరి ధాన్యానికి నల్లటి మచ్చంటూ ఎఫ్‌సిఐ కొనుగోలు చేసేందుకు ముందుకు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాకలెక్టర్ రాంగోపాల్ కొద్ది శాతం మచ్చ వున్నందు వల్ల ఇబ్బందేమీ లేదని కొనుగోలు చేయవచ్చని చెప్తున్నా ఎఫ్‌సిఐ ససేమిరా అంటుండడంతో రైతులు దిగాలు పడిపోయారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు సైతం మంచువల్ల మచ్చలు వస్తాయని, దానివల్ల ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బందిలేదని తెలియజేస్తున్నప్పటికీ అధికారుల తీరులో మార్పు రాలేదు. జిల్లాకు 12వేల టన్నుల బియ్యం అవసరమని, ఆ ధాన్యాన్ని ఇక్కడే కొనుగోలు చేస్తామని కలెక్టర్ చెప్తున్నా ఎఫ్‌సిఐ అధికారులు సాంకేతిక కారణాలు చూపుతున్నారు. మచ్చ పేరుతో రైతులకు అన్యాయం చేయవద్దని రైతు సంఘం ప్రతినిధులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

• వాడివేడిగా...

# కావలి మునిసిపల్ సమావేశం!

## పాత తీర్మానాలపై రగడ

కావలి మునిసిపల్ సమావేశంలో స్వపక్షీయులే విపక్షం పాత్ర పోషించడంతో గందరగోళం నెలకొనింది. మునిసిపాలిటీకి సంబంధించిన అత్యవసర సమావేశాన్ని 26వ తేది నిర్వహించారు. మునిసిపల్ ఛైర్మన్ నగళ్ల శ్రీనివాసకిరణ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం ప్రారంభం కాగానే కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ నున్నా వెంకట్రావు అధికారుల తీరుపై తీవ్రంగా విరుచుకపడ్డారు. గత సమావేశంలో పలు తీర్మానాలను వాయిదా వేశారని, వాటిని ఈ అజెండాలో ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. దీనికి అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పట్టణంలో ఏర్పాటుచేసిన ప్రచార బోర్డులను తొలగించడంలోనూ అధికారులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించడంతో సభలో గందరగోళం నెలకొంది. మరో కౌన్సిలర్ కామరాజు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పలేకపోయారు. సమావేశం గురించి, అజెండా గురించి ముందుగా సమాచారం ఎందుకు అందించలేదని ఆయన నిలదీశారు. కౌన్సిలర్ రాజశేఖర్ మాట్లాడుతూ టీచర్లను సంబంధిత కౌన్సిలర్ ఆమోదం పొందకుండానే బదలీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ సందర్భంలో టిడిపి ఫ్లోర్ లీడర్ శ్రీనివాసులు జోక్యం చేసుకొంటూ అధికారపక్షం అడిగే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పలేకపోవడాన్ని విమర్శించారు. ఈ పరిస్థితులలో ఛైర్మన్ కిరణ్ జోక్యం చేసుకొని అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ సభను వాయిదావేసి వెళ్లిపోయారు. పిఆర్పీ కౌన్సిలర్ షాహుల్, బిజెపి కౌన్సిలర్ భరత్, కెపిసి సభ్యుడు బ్రహ్మయ్య తదితరులు అధికారుల తీరును నిరశించారు.

# బుచ్చిలో కళాసాగర్ రజతోత్సవాలు!

## మే 6 నుంచి 10తేది వరకు

బుచ్చి కేంద్రంగా క్రమం తప్పకుండా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే కళాసాగర్ సంస్థ రజతోత్సవాలకు సిద్ధమవుతోంది. 1985లో ఏర్పాటైన సంస్థ ఇప్పటివరకు పలు కార్యక్రమాలను నిర్వహించి జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు గడించింది. స్వర్గీయ చీమల రాధాకృష్ణయ్య స్మృత్యర్థం నిర్వహించే ఈ రజతోత్సవాలు మే 6 నుంచి 10 వరకు జరుగుతాయని అధ్యక్షుడు దొడ్ల రమణయ్య తెలిపారు. ఈ రజతోత్సవాల్లో ప్రదర్శించే ప్రతి నాటికకు ఏడు వేల రూపాయలను బహుమతిగా అందజేస్తామని, ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన నాటికలకు 11వేలు, 10వేలు, 7వేల రూపాయలు ఇస్తామన్నారు. ప్రత్యేక జ్యూరీ బహుమతిగా ఎనిమిది వేల రూపాయలతోపాటు షీల్డు అందజేస్తామని ప్రకటించారు. వివరాలకు 9866800121 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

# కావలిలో పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

## డివిజన్ పంచాయితీ అధికారి ప్రకటన

కావలి డివిజన్‌లో ఇంటి పన్నుల బకాయిల వసూళ్లకు అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. డివిజన్ పరిధిలోని 63 పంచాయితీలలో 2002 నుంచి నాలుగు కోట్ల రూపాయల పన్నుల బకాయిలు వున్నట్లు పంచాయితీ అధికారి బాదుషాఖాన్ తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెంలో 38 లక్షలు, బోగోలులో 14 లక్షలు, కోవూరులో ఏడు లక్షలు, అల్లూరులో 18 లక్షలు, దగదర్తిలో పది లక్షలు, కావలిలో ఏడు లక్షల రూపాయలు పన్నుల రూపంలో రావాల్సి వుందన్నారు. మిగతా గ్రామ పంచాయితీల్లోనూ అధికమొత్తంలో పన్నులు వసూలు కావాల్సి వుందని చెప్పారు. పలుచోట్ల పన్నుల వసూళ్లలో అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులు అందుతున్నాయని వీటిపై విచారణ జరిపి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొంటామని వివరించారు. బకాయిల వసూళ్లలో సర్పంచ్‌లు, ఇఓలు తగిన చొరవ చూపాలని కోరారు.

# మహిళా సాధికారతతోనే అభివృద్ధి!

మహిళా సాధికారతతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని కావలి ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు అభిప్రాయపడ్డారు. 26వ తేది పట్టణంలోని టిటిడి కళ్యాణ మండపంలో పొదుపులక్ష్మి గ్రూపు సభ్యుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. కుటుంబాన్ని తన భుజస్కందాలపై మోసే మహిళ ఏ రంగంలోనైనా రాణించగలదన్నారు. పొదుపు సంఘాలు ప్రభుత్వం అందజేసే పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికవృద్ధి సాధించాలన్నారు. రుణాలను కుటుంబవృద్ధికి వినియోగించాలని, వాటిని సకాలంలో తిరిగి చెల్లించడం కూడా ముఖ్యం అన్నారు. అప్పుడే క్రొత్తగా రుణాలు పొందేందుకు అవకాశం వుంటుందన్నారు. మునిసిపల్ ఛైర్మన్ శ్రీనివాసకిరణ్ మాట్లాడుతూ దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మహిళల సాధికారతకు ఎంతగానో కృషిచేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్పీపి దామిశెట్టి శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.


Statement about ownership and other particulars about the Newspaper

**ZAMIN RYOT (TELUGU WEEKLY)**

NELLORE - 524 001, ANDHRA PRADESH

**FORM - IV** (See Rule 8)

1. Place of Publication : D.No. 16/339, 2nd Floor, Venkataramana Vilas, Pogathota, NELLORE - 524 001
2. Periodicity of Publication : Weekly
3. Printer's Name : N. Dolendra Prasad
   Nationality & Address : Indian, 16-3-629, Ramamurthy Nagar, NELLORE - 524 003
4. Publisher's Name : - do -
   Nationality & Address
5. Editor's Name : - do -
   Nationality & Address
6. Name and Addresses of the individuals who own the newspaper and partners or share holders holding more than one percent of the total capital.

**ZAMINRYOT COMMITTEE**

1. Sri T. Vanamali : President
   Flat No:302, Himagiri Towers
   Kalyan Nagar -
   Venture III Bus Stand
   Mothi Nagar, Hyderabad - 500 018
2. Sri N. Dolendra Prasad : Member
   16-3-629,
   Ramamurthy Nagar
   Nellore - 524 003
3. Sri N. Yamini Chandra : Member
   Zamin Ryot Bldgs.,
   1st Street, Chandramouli Nagar
   NELLORE - 524 004
4. Sri N. Kosalaram : Member
   4A, 1st Block, Kences Enclave
   Ramakrishna Street,
   T.Nagar, CHENNAI - 600 017

I, N. Dolendra Prasad hereby declare that the particulars given above are true to the best of my knowledge.

**N. DOLENDRA PRASAD,** Publisher

# అసెంబ్లీలో తెలంగాణ ప్రస్తావన లేదు!

పాతాళభైరవి సినిమాలో మాంత్రికుడు ఛూ... మంత్రకాళి అని మంత్ర దండం కదిలించగానే రాజకుమారి అదృశ్యమై పోతుంది. రాజసౌధం కూడా కనపడకుండా పోతుంది. ఇప్పుడు తెలంగాణ ఉద్యమం పరిస్థితి కూడా అట్లనే వుంది. శాసనసభ మొదలై రెండు వారాలైతే ఒక్కసారి కూడా తెలంగాణ అన్న పేరు వినపడలేదు. ఒక్క తెలంగాణ సమస్య చర్చకు రాలేదు. అటు కాంగ్రెస్, ఇటు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేందరూ కూడబలుక్కొని ఆ వివాదం ప్రస్తావనకు రాకుండా జాగ్రత్త పడుతున్నారు. విచిత్రమైన పరిస్థితి ఇది. శాసనసభ మొదలయ్యే నాటికి తెలంగాణ గోలతో అసలు సభ జరుగు తుందా అని భయపడ్డారందరూ. బడ్జెట్ ఆమోదం అనుమానమని ముఖ్యమంత్రి రోశయ్య దిగులు పడ్డాడు. బడ్జెట్ ఆమోదం కాకుంటే నా పదవి ఏమి కాను అని గుబులు చెందాడు. ఆ భయాలు, ఆ సందేహాలు, ఆ అంచనాలు అన్నీ పటాపంచలై పోయాయి. రాజకీయవాదులు తలచుకొంటే ఎంత పెద్ద ఉద్యమాన్నైనా ఎట్లా నీరుగార్చగలరో మరొకసారి నిరూపిస్తున్నాయి ఇప్పటి పరిణా మాలు. మరొకప్రక్క ఉస్మానియా, కాకతీయ విశ్వ విద్యాలయాలలో పరీక్షలు మొదలు కావడంతో విద్యార్థులు కూడా తమ దృష్టి మరల్చారు. వీధుల లోకి రావడం మానుకొన్నారు.

ఈ పరిణామం పట్ల హైదరాబాద్‌వాసులు, మరీ ముఖ్యంగా వ్యాపార, పారిశ్రామిక వర్గాలు మహదానందంతో వున్నాయి. తెలంగాణ గొడవ మూలంగా నాలుగు నెలల నుంచి రాజధాని నగరం స్మశాన సాదృశ్యంగా మారింది. పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్‌లో కూడా వ్యాపారాలు లేవు. చిన్న చిన్న అంగళ్ల వారికైతే అసలు బోణీయే లేదు. రాజ్‌భవన్ రోడ్డు, బంజారా హిల్స్, మాదాపూర్ వంటి కీలక ప్రాంతాలలో వందలాది వ్యాపార సంస్థలు దివాలా తీశాయి. ఎక్కడచూసినా టూలెట్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఉద్యమంలో ఏరోజు ఏమి జరుగుతుందో తెలియక, ఏ పూట ఎవరు బంద్‌కు పిలుపు ఇస్తారో, ఏ బస్సు ఎక్కడ నిలిచి పోతుందో వూహించలేక ఆంధ్ర ప్రాంతం నుంచి హైదరాబాద్‌కు రావడమే మానుకొన్నారు జనం. రియల్ ఎస్టేట్ వ్యాపారులైతే తమకిక భవిష్యత్తు లేదని కృంగి పోయారు.

రెండు వారాలుగా తెలంగాణ వూసు విన పడక పోవడంతో అందరికీ మళ్లీ వూపిరి వస్తు న్నది. హైదరాబాద్ నగరంలో బ్రతకగలమన్న ఆశ చిగురిస్తున్నది. శుభ పరిణామం ఇది.

# 34 ఏళ్లుగా త్యాగరాజ స్మరణోత్సవాలు!



భిక్షాటన పూర్వక త్యాగరాజస్మరణోత్స వాలు నగర వాసులకు సుపరిచితమే. త్యాగయ్యను స్మరిస్తూ వీధి వీధి తిరిగి జోలెపట్టి వచ్చిన దాంతో ఈ ఉత్సవాలను జరపడం ఆన వాయితి. ఈ భిక్షాటనకు ఎంతో నేపథ్యం వుంది. ప్రఖ్యాత సినీ నేపథ్య గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం తండ్రి పండితారాధ్యుల సాంబ మూర్తి తన మిత్రులతో కలసి త్యాగరాజ ఉత్స వాలను నిర్వహించేందుకు 1965లో శ్రీకారం చుట్టారు. ఆనాటి నుంచి నేటి వరకు నిర్విరా మంగా ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. త్యాగ రాజు సిద్ధి పొందిన తిరువాయూరులో ఆరాధన ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. వీటిని విభిన్నంగా నిర్వహించ తలపెట్టిన సాంబమూర్తి బృందం భిక్షాటన పూర్వకంగా జరిపేందుకు నడుం బిగిం చింది. నగర సంకీర్తన చేస్తూ ప్రతి సందుగొందె తిరుగుతూ త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తూ ప్రజల నుంచి జోలెపట్టి ధన రూపేణా, బియ్యం రూపేణా ఇచ్చేవాటిని స్వీకరిస్తూ వాటితో త్యాగ రాజ ఉత్సవాలను జరుపుతుంటారు. ప్రతి ఏడాది మార్చి మొదటి వారంలో పాల్గుణ బహుళ పంచమి నుంచి ఏకాదశి వరకు ఈ త్యాగరాజ ఉత్సవాలు నిర్వహించడం అందరికీ తెలిసినదే. 34 సంవత్సరాలుగా ఎవరిపై ఆధారపడకుండా, ఎవరి నుంచి సహాయసహకారాలు అర్థించ కుండా భిక్షాటన పూర్వకంగా త్యాగయ్యను స్మరించుకొంటూ కార్యక్రమం నిర్వహించడం ఈ బృందం సభ్యుల కృషికి నిదర్శనం. త్యాగరాజ స్వామికి ఆలయం వుండాలని భావించి 1983లో వేదాయపాళెంలో మందిరాన్ని నిర్మించారు. ఎంతో ఖ్యాతి గడించిన భిక్షాటన పూర్వక త్యాగ రాజ ఉత్సవాల్లో ఎందరో లబ్ధప్రతిష్ఠులైన విద్వాం సులు పాల్గొని వున్నారు. చెంబై వైద్యనాథన్ భాగవతార్, డికె.పట్టమ్మాళ్, ఎంఎస్ బాలసుబ్ర మణ్యం, శ్రీరంగం గోపాలరత్నం, బాలమురళీకృష్ణ లాంటి ఎందరో పేరొందిన సంగీత విద్వాంసులు ఈ వేదికపై కచ్చేరి నిర్వహించి వున్నారు. ఈ ఉత్సవాల్లో పాల్గొని కచ్చేరి చేయడం గొప్ప అదృష్టంగా భావిస్తారు. అలాంటి ఉత్సవాలు ఎప్పటిలాగే టౌన్‌హాలులో మార్చి 5వ తేది నుంచి 11తేది వరకు వారం రోజులపాటు జరగను న్నాయి.




# స్పీడుగా పనిచేస్తున్న ఎస్పీ దామోదర్!



బాధ్యతలు తీసుకొని పక్షం రోజులు కాక మునుపే ఎస్పీ ఈతముక్కల దామోదర్ నాయుడు తన పనితీరుతో అందరినీ ఆకట్టుకొంటున్నారు. సిబ్బంది బదిలీల్లో ఆయన రాజకీయ జోక్యాన్ని అనుమతించక ఎస్‌ఐలు అడిగిన పోలీస్‌స్టేషన్లలో వారికి పోస్టింగులిచ్చి ఇష్టంగా డ్యూటీ చేయమన్నారు. ఎప్పటికప్పుడు ప్రజా విజ్ఞప్తులపై స్పందిస్తున్న నాయుడు 1వ తేది గొడవలు, ఈవ్‌టీజింగులకు కారకులవుతున్న రౌడీషీటర్లతో మేళా నిర్వహించారు. మరీ అతిగా వ్యవహరిస్తున్న 37 మందికి సాయంత్రం తన బంగ్లాలో క్లాసు తీసు కొన్నారు. వ్యవహారశైలి మార్చుకోకపోతే జిల్లా బహిష్కరణ శిక్ష విధిస్తానని చెప్పాల్సిన తీరులో చెప్పారు. ట్రాఫిక్‌పై కూడా ఎస్పీ దృష్టి పెట్టారు. నగరంలో అడ్డదిడ్డంగా పెట్టి వుండే వాహనాల తొలగింపుకు కార్పొరేషన్ సహకారంతో 15 లక్షలు వెచ్చించి ఓ క్రేన్ కూడా కొనబోతున్నారు. పాత ఎస్పీ కె.శ్రీనివాసరెడ్డి హయాంలో వున్నట్లు అన్ని విషయాల్లో తనకు సహ కరించను ఐడి పార్టీని పునరుద్ధరించే ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. దొంగతనాలపై ఎస్పీ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన పరిస్థితులు ప్రస్తుతం జిల్లాలో నెలకొని వున్నాయి. ఈ నేపథ్యంలో ఎస్పీ 3వ తేది కప్ప రాళ్లతిప్పలో పేరుపడ్డ దొంగల గృహాలకు వెళ్లి పరిశీలన చేశారు. ఒక ఎస్పీ ఇలా తిప్పలోని దొంగల ఇళ్లకు వెళ్లడం ఎప్పుడూ జరగలేదు.

# కష్టాల కడలిలో కలువాయి గ్రామ ప్రజలు!

జిల్లాలో ఉన్న 42 మేజర్ గ్రామ పంచాయితీలలో ఒకటైన కలువాయి పంచాయితీ పరిధిలో నివసిస్తున్న ప్రజలు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ పంచాయితీ పరిధిలో 2703 కుటుంబాలకుగాను 10952 మంది జనాభా వున్నారు. రిజర్వేషన్ ప్రాతిపదికన అదృష్టం తలుపు తట్టినట్లుగా ఎన్నికైన గత, ఇప్పటి సర్పంచ్‌లు సొంత నిర్ణయాలు తీసుకోలేని వారు కావడం, కార్యదర్శి ఉండిలేనట్లుగా వ్యవహరిస్తుండడంతో పంచాయితీ వుందా? లేదా? అన్న డోలాయమానంలో జనం వున్నారు. ప్రజలు తొమ్మిదేళ్లుగా పన్నులు చెల్లించక మొండికేస్తున్నారు. ఈ పంచాయితీకి పన్నుల రూపేణా ప్రజల నుంచి ఏడాదికి వసూలు కావాల్సిన తొమ్మిది లక్షల రూపాయలలో 50 శాతం కూడా జమ కావడం లేదు. పంచాయితీ అభివృద్ధికిగాను ఆక్రమణలను తొలగించి ఆర్థిక వనరులు పెంచుకోవాల్సిన పాలకవర్గం, సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వున్నాయి. పంచాయితీలో మూడు వాటర్ స్కీమ్‌లు పనిచేస్తున్నా ఎన్నో ఏళ్లుగా నెలకొని వున్న నీటి సమస్య తీర్చేందుకు నాలుగో వాటర్ స్కీమ్ సిద్ధమవుతోంది. అరకొర తాత్కాలిక సిబ్బందితో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా తయారై డ్రైనేజి వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోవడంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. పంచాయితీని శాపనార్థాలు పెడుతున్నారు. పన్నుల రూపేణా వసూలవుతున్న కొద్ది డబ్బు పంచాయితీలో పని చేస్తున్న పది మంది తాత్కాలిక సిబ్బంది జీతాలకే చాలక వారు ఆరునెలలుగా పస్తులతో జీతాల కోసం ఎదురుచూస్తున్నారు.

12వ ఆర్థిక సంఘం నిధుల నుంచి వీధిలైట్లు, పారిశుద్ధ్యం, మంచినీటి స్కీమ్‌లకు బొటాబొటిగా ఖర్చుపెడుతూ పంచాయితీని నెట్టుకొస్తున్న పరిస్థితులు. ప్రజల నుంచి పన్నుల రూపేణా పంచాయితీకి 30 లక్షల రూపాయలు రావాల్సి వుండగా, విద్యుత్ వినియోగం క్రింద పంచాయితీ ట్రాన్స్‌కోకు ఐదు లక్షల రూపాయలు బకాయి పడివుండడం విశేషం. గ్రామంలోని పరిస్థితులపై గ్రామస్తులిలా స్పందిస్తున్నారు.



దుస్థితిలో రోడ్డు.



### అభివృద్ధికి కృషి చేస్తా!

జిల్లా పంచాయితీ అధికారి ఆదేశాల మేరకు ప్రజల నుంచి రావాల్సిన ఇంటి, కుళాయి, లైసెన్సు ఫీజు బకాయిల వసూళ్ల కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకొని పంచాయితీ అభివృద్ధికి కృషిచేస్తా.

– డిసి.మరియదాను, కార్యదర్శి



### పంచాయితీ వుందా?

అసలు పంచాయితీ వుందా? లేదా? అనిపిస్తోంది. ఈ పంచాయితీని పట్టించుకొని గాడిలోపెట్టే నాయకుడే కరువయ్యారు. ప్రధాన కూడళ్లలో విసిరి వేస్తున్న చెత్తను సిమెంటు కుప్పతొట్టిలలో వేసే ఏర్పాటు చేయాలి. అధ్వాన్నంగా ఉన్న డ్రైనేజి వ్యవస్థను చక్కదిద్దాలి. రోడ్లను నిర్లాక్షిణ్యంగా తవ్వేస్తూ రోడ్లపైకి మురుగునీటిని పంపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి.

– ఎస్.శ్రీనివాసులురెడ్డి



### ప్రణాళిక లేదు!

పంచాయితీని పట్టించుకొని కొల్లుగుంట ఆక్రమణలో ఉన్న షాపుల నుంచి పన్నులు వసూలు చేయాలి. బస్టాండును కబళించి వున్న పండ్ల, కూరగాయల వ్యాపారులను కిష్టం బావి స్థలంలో ఉంచి అద్దెలు వసూళ్లు చేయాలి. బస్టాండులో కొత్తగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ రూమ్‌లను అద్దెకిచ్చి వచ్చే ఆదాయంతో సిబ్బందిని పెంచుకొని పంచాయితీ రూపురేఖలు మార్చేయవచ్చు.

– చల్లా విశ్వనాథరెడ్డి



పారిశుధ్యం పాతరేసిన దృశ్యం.

అవినీతి కథ

### బాతుల పెంపకం పేరుతో

# కోటి రూపాయలకు కుచ్చుటోపీ!

మోసపోయే వారుంటే మోసం చేసేవాళ్లు పుట్టుకొస్తూనే వుంటారు. వివిధ రకాల స్కీంలతో, చీటిపాటల నిర్వహణతో కోట్ల రూపాయలు కొల్లగొడుతున్న వారిని చట్టాలు శిక్షించలేక పోతున్నాయి. చట్టాల్లోని లొసుగులను ఆసరా చేసుకున్న వారు కేసుల నుంచి సురక్షితంగా బయట పడుతున్నారు. తక్కువ పెట్టుబడి పెడితే రెట్టింపు ఆదాయం వస్తుందని ఆశలు కల్పించడంతో పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, వ్యాపారస్తులు కొన్ని సంస్థల్లో పెట్టుబడులు పెడుతున్నారు. అనతికాలంలోనే ఆ సంస్థలను మూసివేయడంతో పెట్టుబడులు పెట్టినవారు లబోదిబోమంటున్న సంఘటనలు నిత్యం చూస్తూనే వుంటాం.

వివిధ సంస్థలను ఏర్పాటుచేసి ప్రజల నుంచి కోట్ల రూపాయలు వసూలుచేసి బోర్డులు త్రిప్పేస్తున్న బడా మోసగాళ్ల వలలో అమాయకులు చిక్కుకుంటున్నారు. ఒక ప్రాంతంలో ప్రజల్ని మోసంచేసిన నిర్వాహకులు మరొక ప్రాంతంలో మరో సంస్థను ఏర్పాటుచేసి మోసాలకు పాల్పడుతున్నారు. ఇందుకు నిదర్శనంగా నెల్లూరు నగరంలో ఇటీవల జరిగిన సంఘటనను పేర్కొనవచ్చు. నగరంలోని కనకమహల్ సెంటర్‌లో సాహితి డక్స్ డెవలప్‌మెంట్ సొసైటీని ఏర్పాటు చేయడం జరిగింది. కలిగిరి మండలంలోని పెదపాడు గ్రామానికి చెందిన బొలిమినేని సత్యనారాయణ, కావలికి చెందిన భాస్కర్ అనే వ్యక్తులు ఈ సొసైటీని ఏర్పాటు చేశారు. సొసైటీలో పెట్టుబడులు పెడితే రెట్టింపు ఆదాయం లభిస్తుందని అందమైన బ్రోచర్లు, కరపత్రాలు ముద్రించి రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేశారు. సొసైటీలో సభ్యత్వం కోసం ఐదువేల రూపాయలు వసూలు చేశారు. సభ్యత్వం పొందినవారు 20వేల రూపాయలు చెల్లిస్తే లక్ష రూపాయల విలువచేసే బాతు పిల్లలను అందజేస్తామని ముందుగానే ప్రచారం నిర్వహించారు. బాతులను అభివృద్ధి చేసే సంస్థగా నిర్వాహకులు ప్రకటించుకున్నారు. 20వేలు చెల్లించి లక్ష రూపాయలు విలువచేసే పిల్లలను పొందినవారు అవి పెద్దవి అయిన తర్వాత వాటి గ్రుడ్లను సంస్థ ప్రతినిధే మార్కెటింగ్ చేస్తారని హామీ కూడా ఇచ్చేశారు. దీంతో ఆశపడిన వారు వేలాది రూపాయలు సొసైటీ ఏజెంట్లకు ముట్టజెప్పారు.

జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా కమీషన్ ఏజెంట్లను నియమించి వారి ద్వారా కోటి రూపాయలకుపైగా బాతుల పెంపకం పేరుతో వసూలు చేశారు. 20వేల రూపాయల వంతున 300 మంది నుంచి, ఐదు వేల రూపాయల వంతున మరో వెయ్యి మంది నుంచి వసూలు చేసుకున్నారు. ఆరు నెలల సమయంలోనే ఈ తతంగం మొత్తం పూర్తి చేసి సంస్థను గుట్టుచప్పుడు కాకుండా మూసివేయడంలో సొసైటీ నిర్వాహకులు సఫలీకృతులయ్యారు. ప్రజల నుంచి కోటి రూపాయలకు పైగా వసూలు చేసిన ప్రతినిధులు ఒక్కరికి కూడా బాతు పిల్లలను సరఫరా చేసిన దాఖలాల్లేవు. గ్రామీణ ప్రాంతాలలో ఏజెంట్లను నమ్మి సొమ్ము చెల్లించిన వారు నగరంలోని ఆ సంస్థ కార్యాలయానికి వచ్చి ఆశ్చర్యపోక తప్పడం లేదు. ఎందుకంటే సొసైటీని మూసివేసి నెల రోజులు కావస్తుందని ప్రక్క షాపుల వారు చెప్పడం ఇందుకు కారణం. కేవలం "సాహితి డక్స్ డెవలప్‌మెంట్ సొసైటీ" అనే బోర్డు మాత్రమే ఇక్కడ దర్శనమిస్తుంది. బాతుల పెంపకం, పిల్లల అభివృద్ధి పేరుతో స్థాపించిన ఈ సంస్థ నిర్వాహకులు వసూలు చేసిన సొమ్ముతో ఉడాయించారు. ప్రస్తుతం సంస్థ ప్రతినిధులు కావలిలోని ఒక లాడ్జిలో మకాం వేసి వున్నట్లు సమాచారం. సొమ్ము చెల్లించిన బాధితులు ఏజెంట్లపై ఒత్తిడి తెచ్చి గట్టిగా మందలించడంతో కావలిలోని లాడ్జికి తీసుకెళ్లి ఎంతో కొంత నగదును ఇప్పిస్తున్నట్లు తెలిసింది. ఏజెంట్ల వివరాలు తెలియని బాధితులు మాత్రం కనకమహల్ సెంటర్‌లో కనిపించిన వారికి తమ గోడును వెళ్లబోసుకుంటున్నారు.




బోర్డు తిప్పేసిన నెల్లూరులోని సాహితి డక్ ఫార్మ్స్ డెవలప్‌మెంట్ సొసైటీ కార్యాలయం.

కోటి రూపాయలకు పైగా వసూలు చేసి ప్రజల నెత్తిన కుచ్చుటోపీ పెట్టిన విషయం బహిర్గతం కాకపోవడంతో సొసైటీ నిర్వాహకులు జల్సా చేస్తున్నారు. వివిధ రకాల స్కీంల పేరుతో విచ్చలవిడిగా ఏర్పాటవుతున్న సంస్థలను పసిగట్టడంలో పోలీసులు వైఫల్యాం చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజలు గమనించి ఇటువంటి చీటింగ్ సంస్థల పట్ల అప్రమత్తంగా వుంటే మంచిది.

## నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైనుతో మేలు!


ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి వెల్లడి.

నెల్లూరు, ప్రకాశం జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన నడికుడి - శ్రీకాళహస్తి రైల్వేలైను పనులను ఈ ఏడాది నుండి చేపట్టేందుకు కేంద్ర రైల్వే మంత్రి మమతా బెనర్జీ ఆమోదం తెలపడాన్ని ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి హర్షాన్ని వ్యక్తం చేసారు. రైల్వే మంత్రి ఛార్జీలు పెంచకుండా రూపొందించిన బడ్జెట్ అమోఘమన్నారు. నడికుడి - శ్రీకాళహస్తి రైల్వేలైను ఏర్పాటువల్ల ఉదయగిరి, పామూరు, కనిగిరి, దర్శి, పొదిలి ప్రాంతాల ప్రజలకు రైలు సౌకర్యం ఏర్పడి మేలు జరుగుతుందన్నారు. రైల్వే స్థలాల్లో మల్టీ స్పెషాలిటీ హాస్పిటళ్ళు, సిబ్బంది గృహాలు కట్టించాలని నిర్ణయించడం శుభపరిణామమన్నారు. రైల్వేస్టేషన్లలో పది రూపాయలకు భోజనం, గ్రామస్థాయిల్లో రైల్వే టిక్కెట్ల అమ్మకం, చౌకగా మంచినీటి సరఫరాకు ప్రాజెక్టుల ఏర్పాట్లు ఈ బడ్జెట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు.

## ఆరోగ్యశ్రీకి కష్టాలు

### చికిత్సకు నిరాకరిస్తున్న కార్పొరేట్ ఆస్పత్రులు


చెల్లుబాటుకాని ఆరోగ్యశ్రీ కార్డులు.

పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందుబాటులోనికి తీసుకవచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ప్రారంభంలో ఆరోగ్యశ్రీ కార్డు వున్న వారికి అందులో పేర్కొన్న వివిధ రకాల ఆరోగ్య సమస్యలకు చికిత్స అందించిన కార్పొరేట్ ఆస్పత్రులు ఇప్పుడు చికిత్సకు నిరాకరిస్తున్నాయి. ప్రభుత్వం నుంచి తగిన నిధులు అందకపోవడం, బిల్లులు రాకపోడంతో చికిత్స అందించేందుకు వెనకాడుతున్నాయి కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు. నగరంలో వుండే రెండు ప్రధానమైన కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు పేదలు. ఆరోగ్యశ్రీ అని పేరు చెప్తేచాలు బెడ్‌లు ఖాళీలేవని చెప్పి వారిని వెనక్కి తిప్పి పంపేస్తున్నారు. ప్రభుత్వం నుంచి బిల్లులు రావన్న ఉద్దేశ్యంతో పేదలు, ప్రాణాపాయస్థితిలో వున్న వారు ఈ ఆస్పత్రులకు వెళ్లినట్లయితే వారికి నిరాకరణ ఎదురౌతుండడంతో పేదలు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ఏవేవో కుంటి సాకులు చెబుతూ పెద్దాసుపత్రికి పంపిస్తుండడంతో అక్కడ అస్థిరకాల వ్యాధులకు తగిన వైద్యసౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో పేదలు ఆందోళన చెందుతున్నారు.

## మెదడువాపు వ్యాక్సిన్‌లకు సిరంజిల కొరత



సరఫరా ఎప్పుడు?

అంగట్లో అన్నీ వున్నా అల్లుడి నోట్లో శని అన్నచందంగా వుంది జిల్లాలో వైద్యఆరోగ్య శాఖ పరిస్థితి. మెదడువాపు వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తగా టీకాలను వేయడం పరిపాటి. ఈ వ్యాక్సిన్ల అమలు జిల్లాలో సక్రమంగా జరగడం లేదు. ఈ దఫా విదేశాల నుంచి వీటిని దిగుమతి చేసుకొన్నా పూర్తిస్థాయిలో అమలు కాలేదు. దీనికి కారణం సిరంజిల కొరత. వ్యాక్సిన్లు వున్నా అవి వేసేందుకు తగినన్ని సిరంజిలు అందుబాటులో లేకపోవడంతో వాటి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతి ఏడాది అక్టోబర్ నెల నుంచి జనవరి వరకు మెదడువాపు వ్యాధి వ్యాప్తిచెందే కాలం కావడంతో ముందు జాగ్రత్తగా వ్యాక్సిన్‌లు వేస్తుంటారు. ఈసారి గతంలో వాడిన వ్యాక్సిన్‌లు కాకుండా ఇతర దేశాల నుంచి జెఇ వ్యాక్సిన్‌లను ఈ సారి ఇంజక్షన్ రూపంలో ఇవ్వనున్నారు. జిల్లావ్యాప్తంగా 1 నుంచి 15 సంవత్సరాల వయస్సులోపు పిల్లలను 8.74 లక్షల మందిని గుర్తించారు. నెల్లూరు, కావలి, గూడూరు డివిజన్లలో మొదటి దఫా క్రింద కొంతమందికి వేసినప్పటికీ ఆరోగ్య శాఖను సిరంజిల కొరత పట్టిపీడిస్తుంది. వ్యాక్సిన్‌లను కలిపేందుకు, వాటిని వేసేందుకు ప్రత్యేక సిరంజిలు అవసరం. దాదాపు లక్షకు పైగా సిరంజిలు జిల్లాకు రానందున పూర్తిస్థాయిలో వ్యాక్సిన్‌లను మార్చి నెల వచ్చినా వేయలేని పరిస్థితి. సకాలంలో ఇవి అందనందువల్ల ప్రభుత్వం ఉద్దేశం, అధికారుల లక్ష్యం నీరుగారిపోయే ప్రమాదం ఏర్పడింది. జిల్లా అధికారులు మాత్రం ఇదిగో వస్తున్నాయి. అదిగో వస్తున్నాయంటూ చెప్పడం మినహా తగిన చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి.

## నత్తనడకన గొర్రెల బీమా

### అధికారుల అలసత్వమే కారణం


ఈ మూగజీవాల ప్రాణాలకు రక్షణేది.

గొర్రెల పెంపకందారులకు తగిన తోడ్పాటునందించేందుకు, జీవాలకు ఆరోగ్యభంగం కలగకుండా ప్రభుత్వం ఏర్పాటుచేసిన గొర్రెల బీమా పథకం అధికారుల అలసత్వం, బీమా కంపెనీల నిర్లక్ష్యం కారణంగా ఎందుకూ కొరగాకుండా పోతుంది. 2006-07 సంవత్సరంలో గొర్రెలకు బీమా పథకాన్ని ప్రవేశ పెట్టింది ప్రభుత్వం. జిల్లావ్యాప్తంగా పది లక్షల గొర్రెలు పెంపకం చేస్తున్నట్లు సమాచారం. ప్రకృతి వైపరీత్యాలు, వ్యాధుల బారినపడి ప్రతి ఏడాది 15వేల గొర్రెలు చనిపోతున్నట్లు అధికారులు చెప్తున్నారు. దీని వలన గొర్రెల పెంపకంపై ఆధారపడిన కుటుంబాలు వీధిన పడుతున్నాయి. దీనిని దృష్టిలో వుంచుకొని ప్రభుత్వం ఈ బీమాను ప్రవేశ పెట్టింది. ఈ పథకం క్రింద ప్రతి ఏడాది 45 రూపాయల ప్రీమియం చెల్లించాల్సి వుంటుంది. దీనిలో 30 రూపాయలు ప్రభుత్వం భరించగా 15 రూపాయలు గొర్రెల పెంపకందారులు భరించే విధంగా రూపొందించారు. పశుసంవర్థకశాఖ అధికారులు, ఇన్సూరెన్స్ కంపెనీల అలసత్వం కారణంగా ఇన్సూరెన్స్ సొమ్ము అందక పెంపకం దారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొనింది. గొర్రెలు మరణించినా రావాల్సిన పరిహారం చెల్లింపులో జాప్యం కారణంగా బీమా కట్టేందుకు వెనుకాడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చొరవ తీసుకొని ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా పథకం ఉపయోగపడేలా తగిన చర్యలు తీసుకోవాల్సి వుంది.

## డిఇఓ ఆఫీసులో వర్గాల కుంపట్లు!


వర్గాలకు నిలయంగా మారిన డిఇఓ ఆఫీసు.

అసలే అస్తుబిస్తుగా వున్న విద్యాశాఖ ఇన్‌ఛార్జిల పాలనలో మరింతగా భ్రష్టు పట్టింది. సంవత్సరాల తరబడి పాతుకుపోయిన ఉద్యోగులు, వారి అవినీతి, అక్రమాలతో గాడి తప్పిన విద్యాశాఖ కార్యాలయంలో వర్గ విభేదాలు ముదిరిపోవడంతో ఆ ప్రభావం కార్యాలయ పనితీరుపై పడి ఫైళ్లు ముందుకు కదలడం లేదు. కార్యాలయంలో ద్వితీయ శ్రేణి అధికారి, మరికొందరు ఉద్యోగులు ఒక వర్గం. చాన్నాళ్లుగా ఆఫీసులోనే కదలకుండా వుంటూ చక్రం తిప్పే సీనియర్ అసిస్టెంట్ మరో వర్గానికి నాయకత్వం వహిస్తుండడంతో ఆఫీసు మొత్తం రెండుగా చీలిపోయింది. ఎవరికి వారు ఒకరిపై ఒకరు పెత్తనం చెలాయించడం, ఫిర్యాదులు చేసుకొంటుండడంతో డిఇవో కార్యాలయానికి వెళ్లాలంటేనే ఉపాధ్యాయులు హడలిపోతున్నారు. రాష్ట్రంలోనే అవినీతి, అక్రమాలలో పేరుగడించిన జిల్లా విద్యాశాఖను గాడిలో పెట్టాలంటే ఇన్‌ఛార్జిల వల్ల కాదన్నది రుజువైంది. ఒకవైపు పదవ తరగతి పరీక్షలు దగ్గర పడడం, మరోవైపు ఉపాధ్యాయుల సమస్యలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో వుండడం వంటి పరిస్థితుల్లో ఇన్‌ఛార్జ్ డిఇఓగా బాధ్యతలు నిర్వహిస్తుండిన ఆంజనేయులు సెలవుపై వెళ్లగా, ఆయన స్థానంలో డిప్యూటీ డిఇఓ ప్రసన్నాంజనేయులు బాధ్యతలు చేపట్టారు. మహా ముదుర్లైన కార్యాలయ సిబ్బందిని సక్రమంగా పనిచేయించే సామర్థ్యం ఆయనకు లేదనేది పలువురి అభిప్రాయం. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని విద్యాశాఖను చక్కదిద్దాలని పలువురు కోరుకొంటున్నారు.

### జడ్పీ స్కూల్‌లో

## అసాంఘిక కార్యకలాపాలు


పొదలకూరు రోడ్డులోని జడ్పీ హైస్కూలు ప్రాంగణం.

నెల్లూరు పొదలకూరురోడ్డులో గల బాలికల ఉన్నత పాఠశాల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. బాలికలకు ప్రత్యేకంగా ఏర్పాటైన ఈ స్కూలు చీకటిపడితే మద్యం త్రాగే వారికి, వ్యభిచారులకు కేంద్రంగా మారుతుండడంతో విద్యార్థినులు ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా పదవ తరగతి చదివే బాలికలు పరీక్షలు దగ్గర పడుతుండడంతో అదనపు క్లాసులకు హాజరు కావాల్సి వస్తోంది. ఈ పరిస్థితులలో పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ఖాళీ అయిన మద్యం బాటిళ్లు, పారవేసిన కండోములు దర్శనమిస్తుండడంతో పవిత్రమైన సరస్వతి నిలయం కాస్త వ్యభిచారకూపంగా మారడంతో చూసేవారికి వేదన కల్గిస్తోంది. తరగతి గదుల్లో ఇవన్నీ పడవేసి వుండడంతో బాలికలే వాటిని తీసి బయట పారవేయాల్సి రావడంతో వారు తీవ్ర మానసిక వేదనకు గురౌతున్నారు. దీనిపై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి ఫిర్యాదుచేస్తే బయటి వ్యక్తులు ప్రవేశాన్ని అడ్డుకోవాల్సింది పోయి తమపైనే కోపగించుకొంటున్నదని విద్యార్థినులు వాపోతున్నారు. జిల్లా పరిషత్ స్కూళ్లు, అందులో చదివే విద్యార్థినుల బాగోగులు పట్టించుకొనే జడ్పీ ఛైర్మన్ ఈ పాఠశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న ఈ సమస్యపై దృష్టిసారించాల్సిన అవసరం వుంది.

## బొత్సా బాంబు

మొదటి పేజీ కొరవ

తోనే ఆయన పెదవి విప్పారని చెప్పున్నారు. కెకె కూడా కాపు నాయకుడు.

కారణం ఏదైనప్పటికీ, బొత్సా వ్యాఖ్యలు రాష్ట్ర కాంగ్రెస్‌లో ప్రకంపనలు పుట్టిస్తున్నాయి. తన మన సులోని భావనలు బయటపెట్టడానికి ఏటికి ఎదు రీదడానికి కూడా సిద్ధపడే రాజకీయవాదులు ఇటీ వలి కాలంలో అరుదై పోయారు. బొత్సా ఇప్పుడా సాహసం ప్రదర్శించి, తన నాయకత్వ స్థాయిని చాటుకొన్నాడు. నిజానికి సమైక్య ఆంధ్ర, తెలంగాణ ఉద్యమాల విషయంలో చాలామంది రాజకీయ వాదులకు తమ స్వంత అభిప్రాయాలున్నాయి. కన్నా లక్ష్మీనారాయణ, డొక్కా మాణిక్య వరప్రసాద్ వంటి మంత్రులు ఆంధ్ర విభజనకు అనుకూలురు. కానీ ఆ మాట బయటకు చెప్పే సాహసం వారికి లేదు. రోశయ్య, చంద్రబాబు నాయుడు సమైక్యవాదులు. కానీ పెదవి విప్పరు. తెలంగాణకు చెందిన పలు వురు నేతలు, ఇటు కాంగ్రెస్, అటు తెలుగుదేశంలో కూడా తెలంగాణ ఏర్పాటుకు విముఖులు. కానీ ఆ మాట చెప్తే జనం పైనబడి కొడతారని భయం. ఒక్క బొత్సా ఒక్కడే భయాలు, సందేహాలు పెట్టుకోకుండా బయటపడి పోయారు. బొత్సా ఒక్కడు ముందు కొచ్చినంత మాత్రాన తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల విషయంలో కేంద్రం ప్రభావితం అవుతుందని భావించడం తెలివి తక్కువ అవుతుంది. ఆయన మాటకు ఢిల్లీలో విలువ వుండకపోవచ్చు. కానీ రాష్ట్రంలో మాత్రం బొత్సా ఒక ప్రత్యేక తరగతికి చెందిన నాయకుడిగా గుర్తింపు పొందుతాడన్నది మాత్రం నిజం.

---

## రోశయ్యపై విసుగు

16వ పేజీ కొరవ

చేయడం విఫల బాధ్యత అవుతుంది. ముఖ్యమంత్రి నిమిత్తమాత్రుడైనట్లు వ్యవహరిస్తే ఇక వారు చేసే పని మాత్రం ఏమి వుంది.

ప్రభుత్వ వ్యవహారాలలో కూడా ఇదే ధోరణి కావడం కాంగ్రెస్ వాదులకు నచ్చడం లేదు. ఒక్క ఫైల్ మీద కూడా సంతకం పెట్టడం లేదాయన. ఎమ్మెల్యేలు పనులు అడగడమే మానుకొన్నారు. సిఎం పేషీకి వెళ్లేవారి సంఖ్య బాగా తగ్గిపోయింది. ఎంతకాలం తమకీ దుర్గతి అని వాపోతున్నారు వారు.

మంత్రివర్గ విస్తరణ విషయంలో కూడా రోశయ్య గారిది అదే శైలి. మూడునెలల క్రితం అందుకు అనుమతి మంజూరు చేసింది అధిష్టానం. కానీ ఆయన చొరవ చూపలేదు. కనీసం శాసనసభ సమావేశాలు ముగిసిన తర్వాత అయినా ఆ ముచ్చట తీరుస్తాడా లేదా అన్న అనుమానంలో పడిపోతున్నారు అందరూ.

---

## జనవాణి

2వ పేజీ కొరవ

### యువతలో కంటి సమస్యలు!

ఒకప్పుడు 60ఏళ్లు పైబడితేగాని కళ్లకు అద్దాలు ధరించేవారు కాదు. కాని నేడు వయ స్సుతో నిమిత్తం లేకుండా రెండు మూడేళ్ల చిన్నా రులు కూడా లావుపాటి అద్దాలను ధరించి కన పడుతున్నారు. దీనికి కారణం విటమిన్–ఎ లోపం. రెండోది పుస్తకాల పురుగులు కావడం. కలెక్టర్ రాం గోపాల్ ప్రత్యేకశ్రద్ధతో రూపొందించిన 'దృష్టి' కార్యక్రమం పేద పిల్లలకు ఎంతో మేలు చేసింది. పిల్లల తల్లిదండ్రులు కూడా చదువే కాకుండా పిల్లల భోజన అలవాట్లు మార్చవలసిన అవసరం ఎంతైనా వుంది.

సిహెచ్.సురేష్‌బాబు, నెల్లూరు

### డిఎస్‌ను దూరంగా పెట్టండి!

రాజ్యసభ ఎన్నికల్లో సీటు లేదా రేపటి ఉప ఎన్నికల్లో సీటు ఆశిస్తున్న పిసిసి అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్‌కు అధిష్టానం ఆ అవకాశం పొరపాటున కూడా ఇవ్వకూడదు. పిసిసి అధ్యక్షునిగా ఆయన రాష్ట్ర పార్టీకి ప్రాతినిధ్యం వహించాల్సిందిపోయి తెలంగాణకు పరిమితమయ్యారు. వైఎస్ హయాం లోనే నిజామాబాద్ అసెంబ్లీ స్థానం నుంచి ఈయన గారు గెలవలేక పోయారంటే స్థాయిని అర్థం చేసుకోవచ్చు. అటువంటి వ్యక్తిని పొరపాటున కూడా అటు రాజ్యసభ, ఇటు అసెంబ్లీ పంపకూడదు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బాగుపడాలంటే వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని పిసిసి అధ్యక్షుడ్ని చేయాలి.

బి.శాలి, కావలి

### ప్రమాణాలు లేని యూనివర్సిటీలు!

1930 ప్రాంతంలో దేశంలో 30 విశ్వవిద్యా లయాలుండినాయి. 1990 నాటికి 177కు, 1996లో 214కు, 2008కల్లా 431 విశ్వవిద్యాలయాల య్యాయి. పన్నెండేళ్ల వ్యవధిలో యూనివర్సిటీలు రెట్టింపు సంఖ్యలో పెరిగాయి. నేడు దేశవ్యాప్తంగా అనేక డీమ్డ్ యూనివర్సిటీలున్నాయి. విశ్వవిద్యాల యాలకు హోదా అయితే వుందికాని ప్రమాణాలు అంతంతమాత్రంగా వున్నాయనడంలో సందేహం లేదు. మౌలిక వసతులు, బోధనా సదుపాయాలు లేకపోయినా విశ్వవిద్యాలయాలు పట్టాలు ప్రదానం చేసి ప్రయోజనమేమి?

పి.సుధామయి, నెల్లూరు.

### రైతు బిడ్డ – వెంకటగిరి

జమీన్‌రైతులో ప్రచురితమయ్యే 70ఏళ్ల క్రితం ఈ వారం శీర్షికలో 'రైతుబిడ్డ' సినిమా నిషేధము; గూడూరు, వెంకటగిరి వుత్తర్వుల గూర్చి వ్రాశారు. ఇవి చదువుతున్నప్పుడు అభ్యుదయవాది జమీందారి వ్యవస్థను ఎదిరించిన సాహసోపేతమైన వ్యక్తి, జాతీయవాది, 'జమీన్‌రైతు' స్థాపక సంపాదకులు నెల్లూరు వెంకట్రామానాయుడు గుర్తుకు వచ్చారు. జాతీయోద్యమంలో 'జమీన్‌రైతు' పాత్ర ఎనలేనిది.

కె.సుజాత, కావలి.

**జమీన్‌రైతు**
పొగతోట, నెల్లూరు - 524 001
ఫోన్: 0861 - 2327354
సెల్: 98489 66190
జీవిత చందా రూ.1000లు
సంవత్సర చందా
స్వదేశంలో రూ.200లు
విదేశాలకు రూ.1000లు

---

● విమర్శలు చేసేవారిని బెదిరిస్తున్న వివేకా, భానుశ్రీ

# గబ్బు పట్టినా మారని మనుషులు!

అధికారం అవినీతిని నేర్పుతుంది. అవధులు లేని అధికారం దానికి అహంకారాన్ని జత చేస్తుంది. ఇవి రెండూ తలకెక్కిన వారికి కన్ను మిన్ను కానకపోవడం అత్యంత సహజం. ఆ గుడ్డితనంతో తప్పులు చేస్తూనే పోతారు. పీడనపోయే గొడవలు ఇంటికి తెచ్చుకొంటారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి, మేయర్ నందిమండలం భానుశ్రీలు ఇప్పుడీ మానసిక స్థితి లోనే ఉన్నారనిపిస్తున్నది. వైఎస్ పుణ్యాన నెల్లూరు నగరం విషయంలో వివేకాకు పూర్తి స్వేచ్ఛా స్వాతం త్ర్యాలు సంక్రమించాయి. కార్పొరేషన్ ఆఫీస్ ఆయన జేబు సంస్థగా మారింది. తెలివైన రాజకీయవాది అయితే, ఇంత అధికారం చేతికి వచ్చినందుకు ప్రజలకు ఉపయోగపడే పనులు చేసి చిరకాలం తన పేరు గుర్తుండిపోయే రీతిలో మలచుకొని వుండవచ్చు. అభిమానులను సంపాదించుకొని ఉండవచ్చు. కాని ఆయన అందుకు విరుద్ధంగా ప్రవర్తించాడు. ఎంతవాడైనా తన అధికారం ముందు దాసోహం అనాలని కోరుకొన్నాడు. దాంతో దగ్గరి వారు కూడా దూరమైపోయారు. మరొక ప్రక్క భానుశ్రీని సం తోష పెట్టాలనే ఏకైక కోరికతో మునిసిపాలిటీని గబ్బుపట్టించాడు. ఊరికి దరిద్రం పట్టించాడు. వచ్చిన ప్రతి రూపాయి నిధి ఆమె ఇంటికి పంపడం తప్ప ఊరు బాగుకోసం పీసమంత ప్రయత్నం చేయడం లేదాయన. దాంతో నెల్లూరు నగరం నాగరిక జీవనానికి అర్హతలేని ప్రదేశంగా తయారయ్యింది. ఒక్క రోడ్డూ బాగుపడదు. ఒక్క కాలువా శుభ్రం కాదు. ఒక్క సమస్యకూ పరిష్కారం దొరకదు. కోట్లకు కోట్లు మాత్రం ఖర్చై పోతున్నాయి.

రాజీవ్‌భవన్ నిర్వాహకులు ఆయనకు, మేయర్‌కు కంట్లో నలుసు మాదిరి తయారైనారు. ఒకప్పుడు వారంతా వివేకాకు ప్రధాన అనుచరులు. అభిమానులు. ఆయన కోసం ఏ పనైనా చేయ డానికి సిద్ధపడిన వారు. చెప్పిన పనల్లా చేసిన వారు. ఇప్పుడు కక్షలు పెరిగిపోయాయి. దాంతో మేయర్ అవినీతిని బట్టబయలు చేస్తున్నారు. వారు వెలికితీస్తున్న వివరాలు చూస్తుంటే కళ్లు తిరిగి పోతున్నాయి. భానుశ్రీకి స్థలము, ఇళ్లులేని ప్రాంతం నెల్లూరు నగరంలో ఉన్నట్లు కనపడడం లేదు. మునిసిపల్ రాజకీయాన్ని అడ్డం పెట్టుకొని ఒక రాజకీయవాది అన్ని ఆస్తులు కూడబెట్టుకోవడం సాధ్యమా అని ఆశ్చర్యం కలుగుతున్నది.

తన, తన అనుచరురాలి అవినీతి నగ్నంగా వెల్లడి అవుతున్నందుకు సిగ్గుతో చితికిపోయి, చేసిన తప్పులకు చెంపలు వేసుకొని, మరొకసారి అటువంటి తప్పులు చేయకుండా జాగ్రత్తపడి వుంటే వివేకానందరెడ్డి గౌరవం పెరిగేది. కానీ భానుశ్రీ నాలుగు ఆస్తులు సంపాదించుకుంటే తప్పేమిటని దబాయిస్తున్నాడాయన. ఎబిఎన్ – ఆంధ్రజ్యోతి టివి ఛానల్ ఈ అంశంపై ఆరాతీస్తున్నదని తెలిసి ఆ విలేఖరికి ఫోనుచేసి అదే మాట అన్నాడట. వారు ఆ మాటలు కూడా ఛానల్‌లో ప్రసారం చేశారు. పరువు పోయింది. ఇంత గబ్బుపట్టిన తర్వాతైనా జాగ్రత్త పడుతున్నదా అంటే అదీలేదు. తనను విమ ర్శించేవాళ్లు చెత్తఎత్తుకొనే వాళ్లతో సమానమని చీదరించుకొన్నది భానుశ్రీ. ఆ ప్రక్క రోజ బోడిగాడి తోటలో చెత్తకుప్పల మీద కాగితాలు ఏరుకొనే వాళ్లు పాతిక ముప్పై మంది గాంధీబొమ్మ వద్ద ధర్నా చేశారు. వ్యభిచారం చేస్తే నేరం, దొంగతనాలు చేస్తే నేరం, చెత్త ఎత్తుకోవడం నీచమైన పని ఎట్లా అవుతుంది, మీ వలె అందరికీ వివేకానందరెడ్డి స్నేహం దొరకదు, పెట్టుబడులు లేని వ్యాపారాలు చేయడం వీలుకాదని తిట్టిపోశారు. మేయర్ వంటి గౌరవప్రదమైన పదవిలో వుండే వారికి అంతకంటే హేయమైన పరిస్థితి వేరొకటి వుండదు.

అయినా సరే వివేకా, భానుశ్రీలిద్దరూ కలిసి తమ ప్రవర్తన మార్చుకోవడానికి బదులు తమను విమర్శించేవారిని వదలబోమని హెచ్చరిస్తున్నారు. రాజీవ్‌భవన్‌లోని నలుగురు ముఖ్యులు తనను వెంటాడుతున్నారని, వారిని వదలనని బెదరింపు ప్రకటన చేశాడు. అధికారం వుందని అణచడానికి చూస్తే బెదిరించడానికి ప్రయత్నిస్తే మరింత ముమ్మరంగా దాడులు జరుగుతాయే తప్ప భయపడి దాసోహం అనే వారు ఎవరూ ఉండరన్న నిజం ఆయనకు ఎప్పటికి తలకెక్కుతుందో మరి.

---

## నెల్లూరు ముచ్చట్లు

3వ పేజీ కొరవ

ట్రస్ట్ నేతృత్వంలో ఉగాది పండుగ – ప్రాశస్త్యం అనే అంశంపై మార్చి 7వ తేది వ్యాసరచన పోటీ నిర్వహించనున్నారు. ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు ఒక విభాగంగా, ఇంటర్మీడియట్ నుంచి డిగ్రీ వరకు చదివేవారు మరో విభాగంగా ఈ పోటీలను నెల్లూరు విఆర్ కాలేజితోపాటు స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో ఉదయం పది గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తారు. విజేతలకు మార్చి 14వ తేది స్వర్ణభారత్ ట్రస్ట్‌లో జరిగే ఉగాది పురస్కారాల సభలో అసెంబ్లీ స్పీకర్ కిరణ్ కుమార్‌రెడ్డి, వెంకయ్యనాయుడు బహుమతులు ప్రదానం చేస్తారని ట్రస్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శరత్‌బాబు చెప్పారు.

## ఆటో ఛార్జి పెంపు!

నెల్లూరు నగరంలో తిరిగే సర్వీసు ఆటోలు ఛార్జీని ఐదు రూపాయల నుంచి ఏడు రూపా యలుగా పెంచారు. డీజిల్ రేట్లు పెరిగాయన్న సాకుతో ఈ ఛార్జీని పెంచారు. టౌన్ బస్సుల ఛార్జి ఇదివరకే పెంచిన విషయం పాఠకులకు విదితమే.

## కార్పొరేటర్ మరణం

నెల్లూరు 16వ డివిజన్ కార్పొరేటర్ ఊటు కూరు కేశవరావు 27వ తేది మరణించారు. గత కొంతకాలంగా ఆయన హృద్రోగంతో బాధపడుతు న్నారు. కేశవరావు కార్పొరేషన్ సమావేశాల్లో చాలా హుందాగా వ్యవహరించేవారు. వీరి కుటుంబానికి మా సానుభూతి.

# రోశయ్యపై విసుగు!



అలనాటి పివి. నరసింహారావును తలపింప చేస్తున్నాడు ముఖ్యమంత్రి రోశయ్య. ఎంత సంక్లిష్టమైన సమస్య ఎదురైనా, దాని మానాన దాన్ని వదిలేసి కాలమే పరిష్కరిస్తుందన్న ధోరణిలో వ్యవహరిస్తున్నారు. అది తెలంగాణ ఉద్యమమైనా, జగన్ గొడవలైనా, మంత్రుల కీచులాటలైనా, నిధుల కొరతైనా, జలయజ్ఞం కాంట్రాక్టర్ల గోల అయినా ఒకటే తీరు. ఉలకడు పలకడు. తన అభిప్రాయం ఏమిటో చెప్పడు. ఏ నిర్ణయం తీసుకోడు. ఈ ధోరణి కాంగ్రెస్ నాయకులకు విసుగు పుట్టిస్తున్నది. వైఎస్.రాజశేఖరరెడ్డి పాలన దగ్గర నుంచి చూసిన ఎమ్మెల్యేలు, మంత్రులకు మరీ చిరాకుగా వుంది. ఏ వివాదం వచ్చినా అందులో తలదూర్చేవాడు వైఎస్. తెరవెనుక మంత్రాంగం నడిపేవాడు. శాసన సభలో అయితే నేరుగా జోక్యం చేసుకొనేవాడు. ఒక్కొక్కసారి దాని వల్ల ఇబ్బందులు ఎదురైనా సహించేవాడు. తలెత్తిన సమస్య అణగారి పోయినంత వరకు అదే పని అన్నట్లు వుండేవాడు. దాని నుంచి రాజకీయంగా ప్రయోజనం ఎట్లా వస్తుందా అని చూసేవాడు.

రాజకీయాలలో చాలా వివాదాలు, ఉద్యమాలు, సమస్యలకు తెరవెనుక మంత్రాంగం తప్పనిసరి. వివాదం రేకెత్తించిన వారి నోరు మూయించడానికి సామదాన బేధ దండోపాయాలు ప్రయోగించడం సహజం. లేకుంటే అది ముదిరి చిక్కులు తెచ్చి పెడుతుంది. ప్రజారాజ్యం ఎమ్మెల్యేలను తన జట్టులో కలుపుకొన్నా, టిఆర్ఎస్ ఎమ్మెల్యేలను టోకున కొనుగోలు చేసినా, టిడిపి మహిళా నేత రోజాను అక్కున చేర్చుకొన్నా, అదే పార్టీ ఎమ్మెల్యేలు ప్రసన్నకుమార్‌రెడ్డి వంటి వారిని వలలో చిక్కించుకొన్నా తెరవెనుక మంత్రాంగాల ద్వారానే సాధ్యమయ్యాయి.

రోశయ్యగారు ఆ శ్రమ ఎంత మాత్రం తీసుకోవడం లేదు. శాసనసభలో మంత్రులు తప్పులు చేస్తున్నా చూస్తూ వూరకుండి పోతున్నాడు. ప్రతిపక్షం ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెడుతున్నా మౌనం వహిస్తున్నాడు. ఎమ్మెల్యేలకు దిశా నిర్దేశం చేయడం లేదు. చీఫ్ విప్‌కు అసలు పనే లేకుండా పోయింది. సభలో అనుసరించవలసిన ధోరణిపై ముఖ్యమంత్రి ఏదైనా వ్యూహం రచిస్తే, దాన్ని అమలు

కొరవ 14వ పేజీలో


## ఆరవ వర్థంతి



కీ.శే శ్రీ సన్నపరెడ్డి వెంకటరెడ్డి గారు

Chairman : Hotel Simhapuri, Nellore ; Prop : Esveeaar Distilleries, Tirupathi.

తేది 8-3-2010 ఆరవ వర్థంతి సందర్భంగా వారిని స్మరించుకుంటూ

కుమారుడు : సన్నపరెడ్డి శ్రీధర్‌రెడ్డి మరియు కుటుంబసభ్యులు.

వర్థంతి కార్యక్రమం : తేది 08-03-2010 సోమవారం నాడు అనంతసాగరం మండలం, వరికుంటపాడు గ్రామంలోని మా స్వగృహమునందు మరియు నెల్లూరులోని హోటల్ సింహపురి నందు వర్థంతి కార్యక్రమం, పేదలకు అన్నదానం జరుగును.





స్వర్గీయ వేమిరెడ్డి శివకోటారెడ్డి గారు

నిర్యాణం: 06-03-2001

## 9వ వర్థంతి

పూజ్యులు

స్వర్గీయ వేమిరెడ్డి శివకోటారెడ్డి గారు

స్వర్గస్తులై 06.03.2010 నాటికి
తొమ్మిది సంవత్సరాలు నిండుతున్న సందర్భంగా
వారి ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య : వేమిరెడ్డి శ్యామలమ్మ

కుమారుడు : వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి
కాంట్రాక్టర్
రామ్మూర్తినగర్, నెల్లూరు


Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.